భూగర్భమే సాయం..!

ఏటిలో తోడుతున్న నీటితో పంటల సాగు

- పూర్తిగా ఎండిన వైరా నది
- పంటలకు అందని సాగు నీరు
- ప్రొక్లెయిన్‌తో భూగర్భ జలాలు తోడి ఆపై మోటార్ల సాయంతో పొలాలకు..


స్నానాల లక్ష్మీపురంలోని ఏటిలో పొక్లెయిన్‌తో తీయించిన గుంతలో నిలిచిన నీరు


గన్నవరం సమీపంలోని వైరా నది ఏటిలో భూగర్భ జలాల కోసం గుంత తవ్వుతున్న ప్రొక్లెయిన్

వైరారూరల్: గతేడాది ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదు కాకపోవడం, సాగర్ జలాలు విడుదల చేయకపోవడంతో వైరా రిజర్వాయర్ నీటి మట్టం పూర్తిస్థాయిలో తగ్గింది. దీంతో రిజర్వాయర్‌ను అనుసంధానంగా వైరా నది పరివాహక ప్రాంతం పూర్తిగా ఎండిపోయింది. ఫలితంగా నది ఏటి కింద పంటలు సాగు చేసే రైతులు ఈ యాసంగిలో సాగు నీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే ఏటి కింద సాగు చేస్తున్న వరి పైర్లు పొట్ట దశకు చేరుకోవడంతో మరో నెల సాటు వరి పొలాలకు సాగు నీరు అందించాల్సి ఉంది. దీంతో వైరా నది ఏటి కింద వరి సాగు చేసే రైతులకు తమ పంటలను కాపాడుకునేందుకు స్నానాల లక్ష్మీపురం, గన్నవరం గ్రామాల సమీపంలోని వైరా నదిలో ప్రొక్లెయిన్‌తో గుంతలు తీసి అందులో పైపులు అమర్చి విద్యుత్ మోటార్ల సాయంతో వరి పంటలను సాగు నీటిని అందిస్తున్నారు.

నది కింద పంటల సాగు

వైరా నది ఏటిలో ఉండే నిల్వ నీటిపై ఆధారపడి ఏడాదికి రెండు పంటలు పండించడం ఆనవాయితీగా మారింది. ఆయా గ్రామాల రైతులకు చెందిన భూములు రిజర్వాయర్ ఆయకట్టుకు చివరి భూములుగా ఉన్న నేపథ్యాన రిజర్వాయర్ కాల్వల ద్వారా సాగు నీరందడం నామమాత్రమే కావడంతో రైతులు ఏటిలో విద్యుత్ మోటార్లను ఏర్పాటు చేసి వందల ఎకరాలను సాగు చేస్తున్నారు.

ఈ ఏడాది ఎండిన వైరా నది..

మండలంలోని స్నానాల లక్ష్మీపురం వద్ద, గన్నవరం –దాచాపురం గ్రామాల అనుసంధానంగా ఉన్న వైరా నదిపై ఏళ్ల కిందట నిర్మించిన లోలెవల్ వంతెనలు దశాబ్ద కాలాలు గడుస్తున్నా నదిలో ఎప్పుడు పుష్కలంగా నీరు ఉండేది. కానీ ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదు కాకపోవడం, భూగర్భ జలాలు అడుగంటడంతో ప్రస్తుతం వైరా నది ఏరు పూర్తిగా ఎండి ఇసుక దిబ్బలు ఏర్పడ్డాయి. దీంతో ఈ ఏటి కింద పంటలు సాగు చేసే రైతులకు యాసంగి సాగు నీరు అందని పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే వరి పొట్ట దశ నుండి కంకి దశకు చేరుతున్న తరుణంలో మరో నెల రోజుల పాటు పంటలకు సాగు నీరు అందించాల్సి ఉంటుంది. దీంతో పొలాలకు నీరు అందించేందుకు ఏటి నుండి భూగర్భజలాలను తోడుతున్నారు.

ప్రొక్లెయిన్‌తో భూగర్భ జలాన్ని తోడుతూ..

గన్నవరం సమీపంలోని వైరా నది ఏటి కింద దాచాపురం గ్రామానికి చెందిన కొంత మంది రైతులు సాగుచేసిన వరి పొట్ట దశ నుంచి కంకి దశకు చేరుకోగా మరో నెల రోజుల పాటు సాగు అవసరముంది. ఇప్పటికే ఎకరానికి రూ.30 నుంచి రూ.40 వేల వరకు పెట్టుబడులు పెట్టిన రైతులు తమ పొలాలు ఎండకుండా ఉండేందుకు పూర్తి స్థాయిలో ఎండిపోయిన ఏటిలో వారానికి ఒకసారి ప్రొక్లెయిన్ గంటకు రూ.1,500 చొప్పున చెల్లించి సుమారు పది నుండి 15 అడుగుల మేర గుంతలను తవ్వించారు. ఆ గుంతలలో ఊట ద్వారా భూగర్భజలాలతో నిండిన అనంతరం నీటిని మోటార్ల సాయంతో పొలాలకు పెడుతున్నారు. ఇప్పటికే పెట్టుబడుటు భారంగా మారిన నేపథ్యాన కంకి దశలో ఉన్న వరి పైర్లు ఎండిపోకుండా ఉండేందుకు అదనపు పెట్టుబడులు చెల్లించాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


గుంతలో నీటిని మోటార్ సాయంతో పొలాలకు పంపుతున్న దృశ్యం

ప్రత్యామ్నాయం లేకనే..



గన్నవరం ఏటి కింద విద్యుత్ మోటార్లతో ఎకరన్నరలో రెండు పంటలు పండిస్తాను. ఈ యాసంగిలో రూ.30 వేలకు పైగా పంటకు పెట్టుబడులు పెట్టాను. వరి కంకి దశకు చేరుకునే సమయానికి వైరా నది ఏరు పూర్తిగా ఎండిపోయింది. ఇంకో నెల రోజుల పాటు పంటకు సాగు నీరు అవసరం ఉండటంతో ప్రత్యామ్నాయం లేక రైతులందరం కలిసి ఏటిలో ప్రొక్లెయిన్‌తో గుంతలు తవ్వించి ఆ గుంతల్లో ఊట ద్వారా వచ్చే భూగర్భ జలాలను వరి పైర్లకు మళ్లించి పంటను కాపాడుకుంటున్నాం.

– కూరాకుల కృష్ణయ్య, రైతు, దాచాపురం

గంటకు రూ.2 వేలు చెల్లించి..



ఈ ఏడాది యాసంగిలో 12 ఎకరాలు కౌలుకు తీసుకోని వరి సాగు చేస్తున్నాను. ప్రస్తుతం వరి పొట్ట దశకు చేరుకోవడంతో మరో 40 నెల రోజుల పాటు వరికి సాగు నీరు అందించాల్సి ఉంటుంది. కాగా వైరా రిజర్వాయర్‌లో నీటి మట్టం పూర్తి స్థాయిలో తగ్గడంతో పాటు వైరా నది కూడా ఎండిపోయింది. పంటలను కాపాడుకునేందుకు కొంత మంది రైతులం కలిసి స్నానాల లక్ష్మీపురంలోని వైరా నది ఏటిలో ప్రొక్లెయిన్‌కు గంటలకు రూ. 2 వేలు చెల్లించి గుంతలను తవ్వించి అందులో నుండి వచ్చే భూగర్భజలాలతో పంటలకు సాగు నీరు అందిస్తున్నాము.

– శీలం విష్ణు, స్నానాల లక్ష్మీపురం

క్లుప్తంగా

సాయిస్ఫూర్తి కళాశాలలో పరిశీలన


రాకెట్ నమూనాను పరిశీలిస్తున్న అధికారి

సత్తుపల్లిరూరల్: మండలంలోని గంగారంలో సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలను స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ కార్యదర్శి ఎ.పుల్లయ్య మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలోని వసతులను పరిశీలించిన ఆయన సెంట్రల్ లైబ్రరీ, తరగతి గదులు, ఆడిటోరియం, హాస్టళ్ల వివరాలు తెలుసుకున్నారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ బూటుకూరి శేషారత్నకుమారితో పాటు టి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

28న బార్ ఎన్నికలు

మధిర: ఈనెల 28న మధిర బార్ అసోసియేషన్‌కు ఎన్నికలు జరుగుతాయని ఎన్నికల అధికారి చింతల గోపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నిక ప్రక్రియలో భాగంగా శనివారం నామినేషన్ల ఉపసంహరణ అనంతరం నాలుగు పదవులు ఏకగ్రీవమైనట్లు తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బోజడ్ల పుల్లారావు, ప్రధాన కార్యదర్శిగా కోట జ్ఞానేశ్, ఉపాధ్యక్షుడిగా జె.రమేష్, కోశాధికారిగా కె.విజయ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. సహాయ కార్యదర్శి పదవికి భైరవభట్ల వెంకటరమణారావు, పుట్టా శ్రీనివాసరావు మధ్య ఈనెల 28న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పోలింగ్, ఓట్ల లెక్కింపు, ఫలితాలు ప్రకటన జరుగుతుందని ఆయన తెలిపారు.

బీమా నగదు అందజేత



నగదు అందజేస్తున్న సొసైటీ చైర్మన్, బ్యాంకు మేనేజర్

ఎర్రుపాలెం: మండలంలోని అయ్యవారిగూడెం సొసైటీ పరిధిలోని నర్సింహాపురం గ్రామానికి చెందిన రైతు గంతాల శ్రీనివాసరావు మృతి చెందగా ఆయన పేరిట సొసైటీలో గ్రూపు ఇన్సూరెన్సు చేయగా మంజూరైన బీమా నగదు రూ. 50 వేలను బాధిత కుటుంబానికి అందజేశారు. శుక్రవారం మండలకేంద్రంలోని డీసీసీబీ మేనేజర్ మగినం వీరభద్రం, సొసైటీ చైర్మన్ అనుమోలు సాంబశివరావు నామినీ వెంకట్రావమ్మకు నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ నాగలక్ష్మి, భానుప్రియ, సూపర్‌వైజర్ మహేష్, సీఈవో మోహన్‌రావు, డైరెక్టర్ యరమల శ్రీనివాసరెడ్డి, సిబ్బంది మురళి, రమణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కళాశాల వార్షికోత్సవ వేడుకలు

సత్తుపల్లి: మండల పరిధిలోని కొత్తూరులో మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాల 23వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్రీడా, సృజనా, యవదికా అనే మూడు కమిటీల ద్వారా వివిధ రకాల పోటీలు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ చలసాని హరికృష్ణ తెలిపారు.

స్వీట్లు పంపిణీ


స్వీట్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని మజీద్‌లో శుక్రవారం రంజాన్‌మాసంలో ఉపవాస దీక్ష చేపట్టిన పలువురు ముస్లింలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్లెల లక్ష్మణరావు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మెట్టు కృష్ణ, సూరంశెట్టి రాజేష్, మిరియాల నాగబాబు, వీరంశెట్టి శ్రీనివాసరావు, షేక్ హుస్సేన్ తదితరులున్నారు.

బెల్ట్‌షాపుల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు

కల్లూరురూరల్: కల్లూరు మండలంలోని లింగాల, వాచ్యానాయక్ తండా, పెద్దకోరుకొండి, చిన్నకోరుకొండి, చెన్నూరు గ్రామాల్లో కొనసాగుతున్న బెల్ట్‌షాపుల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు శుక్రవారం తనిఖీలు చేపట్టారు. డీఎల్‌పీఓ ప్రభాకర్‌రావు, డీటీ బాబ్జీప్రసాద్ ఆధ్వర్యాన తనిఖీలు చేపట్టి నిర్వాహకులను హెచ్చరించా రు. గ్రామాల్లో అనుమతి లేకుండా మద్యం అమ్మడం చట్టరీత్యా నేరమని, తక్షణమే షాపులు మూసివేయకపోతే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వేతనాలు ఇవ్వకపోతే ఆందోళన తప్పదు


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, కార్మికులు

వైరా: మున్సిపల్ కార్మికులకు సక్రమంగా వేతనాలు ఇవ్వకపోతే ఆందోళన నిర్వహిస్తామని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మందా వెంకటేశ్వర్లు, సీపీఐ మండల కార్యదర్శి యామాల గోపాలరావు అన్నారు. వైరా మున్సిపాలిటీలో పని చేస్తున్న మున్సిపల్ కార్మికులకు వేతనాలు, రక్షణ పరికరాలు ఇవ్వాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ చింతల వేణుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వైరా మున్సిపాలిటీలో పని చేస్తున్న కార్మికులకు ఎటువంటి రక్షణ పరికరాలు ఇవ్వక పోవడం శోచనీయం అన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్య కూడా పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గారపాటి అశోక్, మిట్టపల్లి రాఘవరావు, కొండా రామకృష్ణ, దొబ్బల కృష్ణ , ముటా కొండ, షేక్ షరీఫ్, రాయపూడి శ్రీను, రాజేష్, కన్నయ్య, కవిత, సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

దేశ శాంతి కోసం ప్రార్థించండి

వైరా: త్వరలో జరగనున్న ఎన్నికల్లో మంచి ప్రభుత్వం అధికారంలోకి రావలని దేశ సంక్షేమం కోసం ప్రార్థనలు చేయాలని వైరా హోలీ ట్రినిటీ చర్చి ఫాదర్ జ్వాన్నేసు సూచించారు. శుక్రవారం వైరా ఆర్‌సీఎం చర్చిలో ఉపవాస ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన భక్తులనుద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా చర్చి ప్రాంగణంలో బహిరంగ శిలువ మార్గం, దివ్యబలి పూజలు సమర్పించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు సంఘస్తులు పాల్గొన్నారు.


వైరా: శిలవ మార్గ ప్రదర్శనలో భక్తులు

వైరారూరల్: ప్రతీ ఒక్కరు ఏసుప్రభు చూపిన శాంతియుత మార్గాన్ని అనుసరించి ఇతరులపై ప్రేమ అనురాగాలతో మెలగాలని ఫాదర్ ప్రసాద్ సూచించారు. మండలంలోని కొండకొడిమ గుట్టపై శుక్రవారం రెబ్బవరం క్రైస్తవ విచారణ పరిధిలోని క్రైస్తవులు ప్రత్యేక ఉపవాస దీక్షల ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్ పరిశుద్ధ శిలువ మార్గం, పరిచర్య, దివ్యబలి పూజలు సమర్పించారు. ఏసు బోధనలు వివరించి త్యాగం, శాంతి, సహనం వహించి ఇతరుల పట్ల ప్రేమతో మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో ధార వెంకటయ్య, దార జకోబు, దార ప్రసాద్, చల్ల గోపి, చల్ల రాధాకృష్ణ, దార రాధాకృష్ణ, అంతోటి శ్రీను, మాచర్ల రమేష్, ముత్తమాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


వైరారూరల్: ప్రార్థనల్లో క్రైస్తవులు..

ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలి


పోస్టుకార్డు ఉద్యమంలో నాయకులు

వైరా: ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రి దివంగత ఎన్టీఆర్‌కు భారతరత్న అవార్డు ఇవ్వాలని టీడీపీ ఖమ్మం పార్లమెంట్ కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం వైరా టీడీపీ కార్యాలయంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ ఖమ్మం పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడు వాసిరెడ్డి రామనాథం మాట్లాడుతూ... ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రకటించాలని కోరుతూ పోస్టు కార్డు ఉద్యమం చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు కాపా కృష్ణమోహన్, పోట్రు వెంకటరామారావు, తాళ్లూరి అప్పారావు, కొనకంచి రామకృష్ణ, కొండబాల కరుణాకర్‌రావు, పోలూరి రామారావు, చెరుకూరి చలపతిరావు, దామా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

చింతకాని: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను మండలంలోని పందిళ్లపల్లి గ్రామంలో శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై నాగుల్‌మీరా తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గంధసిరి మున్నేరు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

గోటి తలంబ్రాలతో బయలుదేరిన భక్తులు


భద్రాచలం బయలుదేరిన రామభక్తులు

కల్లూరురూరల్: భద్రాచలం పుణ్యక్షేత్రంలో జరగనున్న శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవానికి గోటి తలంబ్రాలు సమర్పించేందుకు కల్లూరు మండలంలోని పుల్లయ్యబంజరు గ్రామానికి చెందిన రామభక్తులు కాలినడకన భద్రాచలంకు శుక్రవారం బయలుదేరారు. పుల్లయ్య బంజరు గ్రామానికి చెందిన భక్తులు గత పదిరోజులుగా ధాన్యం గింజలను గోటితో ఒలిచి తలంబ్రాలు చేశారు. ఈ తలంబ్రాలను సమర్పించేందుకు గ్రామం నుంచి కాలినడకన పయనమయ్యారు. కిష్టంశెట్టి నర్సింహారావు, పసుపులేటి సుబ్బారావు, వాసిని కిషోర్, నున్నా నర్సయ్య, బుర్రి వెంకట రామారావు,కృష్ణమాచారి, గంగవరపు పుల్లమ్మ, తండు లక్ష్మణరావు ఉన్నారు.

నీటి ప్రాముఖ్యతపై అవగాహన


బ్రోచర్లతో అవగాహన

కల్లూరు: ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రోటరీ క్లబ్ ఖమ్మం జేవీఎస్ చంద్రశేఖర్ నీటి ఆవశ్యకత, ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. పక్షులను ఏ విధంగా ఆదరించి పెంచాలి, భారతదేశ స్థాయిలో బయోడైవర్సిటీ నీటి వినియోగం, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. హెచ్‌ఎం పత్తిపాటి నివేదిత, ఉపాధ్యాయులు జొన్నలగడ్డ నాగలక్ష్మి, మేడరాజు శ్రీనివాస్, పీఈటీ పసుపులేటి వీరరాఘవయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి..

చింతకాని: ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని జెడ్పీ సీఈఓ వినోద్ పేర్కొన్నారు. చింతకాని ఉన్నత పాఠశాలలో ఓటు హక్కు వినియోగంపై నెహ్రూ యువజన కేంద్రం, నేతాజీ యువజన కేంద్రం ఆధ్వర్యంలో ఓటర్లకు, విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటు హక్కు వజ్రాయుధమని, లోక్‌సభ ఎన్నికల్లో వందశాతం పోలింగ్ నమోదుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా బ్లాక్ లెవల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించి విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు.

పోలింగ్ కేంద్రాల సందర్శన

మండల పరిధిలోని పందిళ్లపల్లి, నాగులవంచ, నర్సింహాపురం, నాగులవంచ రైల్వేకాలనీ, రేపల్లెవాడ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను జెడ్పీ సీఈఓ వినోద్ సందర్శించారు. పోలింగ్ కేంద్రాల్లో వసతులు, సీ–విజిల్ యాప్‌పై అవగాహన వంటి కార్యక్రమాల తీరును పరిశీలించారు. లోక్‌సభ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా బీఎల్‌ఓలకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్ రమేష్, ఎంపీడీఓ రామయ్య, ఎస్సై నాగుల్ మీరా, ఎంపీఓ మల్లెల రవీంద్రప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.


చింతకాని: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ వినోద్


కొణిజర్ల: మాట్లాడుతున్న తహసీల్దార్ హుస్సేన్

కొణిజర్ల: 18 ఏళ్లు నిండిన ప్రతీ విద్యార్థి తప్పనిసరిగా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ తఫజల్ హుస్సేన్ అన్నారు. మండలంలోని తనికెళ్ల సమీపంలో గల విజయ ఇంజనీరింగ్ కళాశాలలో ఓటరు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ చిన్నయ్య, ఆర్ఐ అశోక్ కుమార్ పాల్గొన్నారు.

ఐక్యంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యం


మాట్లాడుతున్న శ్రీనివాసరావు

కారేపల్లి: కారేపల్లి విశాల సహకార పరపతి సంఘం ఐక్యంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమని సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం కారేపల్లి సొసైటీలో మహాజన సభ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సొసైటీ గతేడాది రూ.35.81 లక్షలు లాభాలు గడించిందన్నారు. ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచి రైతు సేవకు అంకితమవుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ధరావత్ మంగీలాల్, డైరెక్టర్లు అడ్డగోడ ఐలయ్య, మర్సకట్ల రోషయ్య, బాణోతు హీరాలాల్, దేగల ఉపేందర్, మద్యాహ్నపు శ్రీనివాస్, కార్యదర్శి బొల్లు హన్మంతరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పోషణ్ పక్వాడా కార్యక్రమం

సత్తుపల్లిరూరల్: ఆహారంలో చిరుధాన్యాలు ఉన్న పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.సుజాత అన్నారు. సత్తుపల్లి సెక్టార్ పరిధిలోని గౌరిగూడెంలో శుక్రవారం పోషణ పక్వాడా కార్యక్రమం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు శ్రీలక్ష్మి, మరియమ్మ, కృష్ణకుమారి, నాగేంద్రమ్మ, పుల్లమ్మ, ఆయాలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మధిరరూరల్: పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ప్రతీ ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చునని మధిర ఐసీడీఎస్ సీడీపీఓ శారదాశాంతి తెలిపారు. సిరిపురం రైతు వేదికలో జరిగిన పోషణ పక్వాడ కార్యక్రమంలో సామూహిక సీమంతం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆరోగ్యవంతమైన జీవితాన్ని పొందాలని మహిళలకు, గర్భిణులకు, చిన్నారులకు, తల్లులకు సూచించారు. ఈ మేరకు స్థానిక అంగన్వాడీ కార్యకర్తలు స్వయంగా తయారు చేసిన తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, అంగన్వాడీ సూపర్‌వైజర్, అంగన్వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

తల్లాడ: మండలంలోని మల్లవరం గ్రామంలో శుక్రవారం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణా పక్షోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సామూహిక సీమంతాలు, అన్నప్రాశన, అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ కృష్ణకుమారి, సూపర్‌వైజర్ హబీబున్నీసాబేగం, అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.


సత్తుపల్లిరూరల్: సామూహిక సీమంతం నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది


మధిరరూరల్: సిరిపురం రైతువేదికలో..


తల్లాడ: మల్లవరంలో..

ఉచిత వైద్యశిబిరాలు

తల్లాడ: మండలంలోని బాలపేట గ్రామంలో శుక్రవారం జిల్లా టీబీ నిర్మూలన అధికారి సుబ్బారావు ఆదేశాల మేరకు వైద్యాధికారి రత్నమనోహర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులకు షుగర్, బీపీ పరీక్షలు చేశారు. టీబీ వ్యాధిపై అవగాహన కల్పించారు. అనంతరం పల్లె దవాఖానా వైద్యాధికారి శ్రీకాంత్.. టీబీ లక్షణాలున్న వారు పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి భాస్కర్, సూపర్‌వైజర్ పెద్ద పుల్లయ్య, టీబీ సూపర్‌వైజర్ సురేష్, పంచాయతీ కార్యదర్శి మహేష్, అమృతరాజు, ఎల్‌టీ కృష్ణ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం

పెనుబల్లి : వియంబంజర్ రాజసాయి మందిరం నిర్వాహకులు జెన్నారెడ్డి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైనట్లు ఆయన తెలిపారు. ఖమ్మం మమత సూపర్ స్పెషాలిటీ వైద్యుల సహకారంతో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో 350 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. వీరికి కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు కె.సాయి అభి, సాయి అభినందన్, సాయితేజ, మానస, సదానందం, ఆప్తాలిస్ట్ కె. ప్రశాంత్, బి.వాసు, జి.గోపి, సైదమ్మ, మౌనిత కుమారి, వంగా నిరంజన్, ఎస్‌కె చాంద్ సాబ్, శ్రీను, నరసింహారావు, బీమిరెడ్డి శ్యామల, శిరీష తదితరులు పాల్గొన్నారు.


తల్లాడ: పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి శ్రీకాంత్


పెనుబల్లి : కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు